సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



భవిష్యత్‌ను మార్చేది గురువు
విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది గురువు మాత్రమేనని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.
- 11లో



పండ్ల తోటలకు రుణాలు
పండ్లు, కూరగాయల తోటలకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.
- 12లో



నూతన ఆవిష్కరణలతో మనుగడ
చేనేత మనుగడకు నూతన ఆవిష్కరణలు దోహదపడుతాయని చేనేత, జౌళిశాఖ అభివృద్ధి అధికారి పేర్కొన్నారు.
- 12లో

న్యూస్‌రీల్

నేడు లోక్ అదాలత్

భువనగిరి క్రైం : జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం వరకు లోక్ అదాలత్ కొనసాగుతుందని, రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకు లావాదేవీలు, టెలిఫోన్ బకాయిలు, ట్రాఫిక్ చాలన్లు, ఇ–పెట్టి కేసులు, మోటర్ వాహన ప్రమాదకేసులు, ఎక్సైజ్ కేసులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలపై సర్వేకు ఆదేశం

భువనగిరి టౌన్ : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన నిర్మాణాలపై సర్వే చేయడానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. దసరా లోపు వివరాలు సేకరించి అందజేయాలని ఉన్నత స్థాయి నుంచి అందిన ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ల ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఎంతవరకు ఉంది, వాటి పరిధిలో ఎన్ని నిర్మాణాలు ఉన్నాయి, ఇంటి నంబర్, యజమాని పేరు, ఎంత విస్తీర్ణం వంటి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. భువనగిరి, మోత్కూరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్న విషయం తెలిసిందే.

యాత్రికుల వివరాల నమోదు తప్పనిసరి



యాదగిరిగుట్టలో లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

యాదగిరిగుట్ట : లాడ్జిలకు వచ్చే యాత్రికుల వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఏసీపీ రమేష్ సూచించారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో లాడ్జీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. ప్రతి లాడ్జిలో సీసీ కెమెరాలు ఉండాలని, రిజిస్టర్ నిర్వహించాలని, వచ్చేవారి ఆధార్‌కార్డు చూసి వారి వివరాలు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

బీబీనగర్ : మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ ఆర్థికంగా బలపడాలని అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. మహిళాశక్తి ప్రోగ్రాంలో భాగంగా బీబీనగర్‌లోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరటి కోళ్ల పెంపంలో చాలా లాభాలు ఉన్నాయని, మహిళలు వాటి పెంపకంలో శ్రద్ధవహించి ఆర్థిక స్వాలంబన సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఓ ఆనందరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

భువనగిరి రూరల్ : వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వర్‌రావు సూచించారు. భువనగిరి మండలం బొల్లేపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు మొక్కజొన్న సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏ పంటలోనైనా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితేనే ప్రయోజనాలు ఉంటాయన్నారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మమత, ఏఈఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. అవస్థే!

భువనగిరి పట్టణంలో జలమయం అవుతున్న రహదారులు



ఇటీవల కురిసిన వర్షానికి జంఖానగూడెం చౌరస్తాలో మోకాలు లోతులో ప్రవహిస్తున్న వరద నీరు

- లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నాలాల ఆక్రమణ, డ్రెయినేజీల నిర్వహణ లేకపోవడం వల్లే సమస్యలు
- ఏళ్ల తరబడి పరిష్కారం చూపని అధికారులు

భువనగిరి : జిల్లా కేంద్రం భువనగిరిలో మోస్తరు వర్షం కురిసినా పట్టణవాసులు నరకం చూస్తున్నారు. నిజాంకాలంలో నిర్మించిన డ్రెయినేజీలు కావడం, ఇటీవల నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు సైతం సరైన నిర్వహణ లేకపోవడం, మరికొన్ని చోట్ల నాళాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఫలితంగా వర్షాలకు రోడ్లపైనుంచి వరద నీరు పోటెత్తడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి.

సమస్య అధికంగా ఉండే ప్రాంతాలు

భారీ వర్షాలు కురిసినప్పుడు సమస్య తీవ్రంగా ఉంటుంది. ప్రధానంగా జంఖానగూడెం, నల్లగొండ చౌరస్తా, వినాయక చౌరస్తా, జగదేవ్‌పూర్ చౌరస్తా, ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ఎదురుగా



నల్లగొండ చౌరస్తా వద్ద.. (ఫైల్)

ఉన్న ప్రధాన రహదారిపై, రైతుబజార్ వద్ద వరద నీటి ప్రవాహం నదులను తలపించే విధంగా ఉంటుంది. ఈ సమయంలో వాహనదారులు, పాదచారులు రోడ్డు దాటలేని పరిస్థితి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వరద ప్రవాహం తగ్గే వరకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

సమస్యపై దృష్టి సారించని యంత్రాంగం

ప్రధాన రహదారుల వెంట ఉన్న డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నా మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు. వర్షాలు వచ్చిన సమయంలోనే హడావుడి చేసే అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదు.

పూడుకుపోయిన డ్రెయినేజీలు

జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నా అందుకు అనుగుణంగా మౌలిక వసతులు సమకూరడం లేదు. కోట్లాది రూపాయలతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. నిర్వహణ లేక చెత్త, మట్టితో నిండాయి. మరోవైపు ఆక్రమణలు తొలగించకుండానే డ్రెయినేజీలు నిర్మించడం, కాలనీల్లోని చిన్న డ్రెయినేజీలను వాటిలో కలపడంతో వర్షపు నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి వస్తుంది. జంఖానగూడెం చౌరస్తాకు సమ్మద్ చౌరస్తాతో పాటు సమీప ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వస్తుంది. అలాగే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించారు. కానీ, వాటిపైన ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్‌ను మూసివేయడంతో వరద నీరు రోడ్డుపైనుంచి ప్రవహిస్తుంది. ఇక నల్లగొండ చౌరస్తాకు పోచమ్మవాడ, ఇందిరమ్మకాలనీ, ఎల్‌బీనగర్, రాంనగర్ కాలనీల నుంచి డ్రెయినేజీల ద్వారా వరద నీరు చేరుతుంది. పెద్ద ఎత్తున చెత్తచెదారం పేరుకుపోవడంతో వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. వినాయక చౌరస్తా వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది.

“ వరద వస్తే వెళ్లలేకపోతున్నాం



భారీ వర్షాలు కురిసినప్పుడు నల్లగొండ మార్గంలో రోడ్డుపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఈ సమయంలో రోడ్డు దాటలేని పరిస్థితి ఉంటుంది. వరద ప్రవాహం తగ్గేవరకు వేరే మార్గం గుండా వెళ్తాం. రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–మనోహర్, భువనగిరి

“ డ్రెయినేజీలను ఆధునీకరించాలి



నల్లగొండ చౌరస్తా వద్దకు ఇందిరానగర్, ఎల్‌బీనగర్, రాంనగర్ కాలనీ నుంచి డ్రెయినేజీల ద్వారా వరద నీరు చేరుతుంది. చౌరస్తా వద్ద రోడ్డు కింది భాగం నుంచి ఉన్న డ్రెయినేజీ పైపులు చిన్నగా ఉండడంతో వరద నీరు రోడ్డుపైకి వస్తుంది. ఈ సమయంలో రోడ్డు దాటడం కష్టంగా ఉంటుంది. డ్రెయినేజీని ఆధునీకరించాలి.

–ఉదయగిరి శ్రీనివాస్, భువనగిరి

ఉద్యమాల ఊపిరి లక్ష్మణ్ బాపూజీ



కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని కలెక్టర్ హనుమంతు కే.జండగే పేర్కొన్నారు. శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమానికి లక్ష్మణ్ బాపూజీ అండగా నిలిచారని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమాన్ని ముందుకు నడిపించారని, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకుతీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్ షాలోమ్, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.ఆండాళ్‌దేవికి నాధస్వరం వినిపించారు.

సంప్రదాయ పూజలు

ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, అర్చన, నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రాకార మండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించి హారతినిస్తున్న అర్చకులు

నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

పీఆర్‌టీయూలో ‘సంస్థాగత’ వేడి

3న జిల్లా కమిటీ ఎన్నికలు
- భారీగానే ఆశావహులు
- ఏకగ్రీవం చేసేందుకు సంఘం పెద్దల ప్రయత్నాలు



సాక్షి, యాదాద్రి : తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఎన్నికలకు ఉపాధ్యాయుల మధ్యన తీవ్రమైన పోటీ నెలకొంది. అక్టోబర్ 3న జిల్లా అధ్యక్ష, కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. అక్టోబర్ 7న రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరుగనున్నాయి. కాగా రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసారి జరిగే ఎన్నికల్లో ఆశావహుల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి ఓటింగ్ నిర్వహించగా, ప్రధాన కార్యదర్శి ఎన్నిక ఏకగ్రీవమైంది. జిల్లాలోని 17 మండలాల కార్యవర్గాల ఎన్నికలు పూర్తిచేసి జిల్లాకార్యవర్గం ఎన్నికలకు ఆ సంఘం నాయకులు సిద్ధమతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పీఆర్‌టీయూ నాయకత్వం పావులు కదుపుతోంది. 2013 నుంచి 2019వరకు ఎమ్మెల్సీగా పూల రవీందర్ ఉన్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ పోటీ చేసిన పూల రవీందర్ ఓటమిపాలయ్యారు. యూటీఎఫ్‌కు చెందిన నర్సిరెడ్డి ఆయనపై విజయం సాధించారు. జిల్లాలో పీఆర్‌టీయూ అత్యధిక సభ్యత్వం కలిగి ఉండడంతో ఎమ్మెల్సీగా విజయం సాధించాలని ఆ సంఘం నాయకులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. బరిలో నిలవనున్న అభ్యర్థులు ఉపాధ్యాయులను కలిసి మద్దతు కోరుతున్నారు.

పోటీ తప్పదా?

జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లాలోని మండల కార్యవర్గాల ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తిచేయడంలో సంఘం నాయకులు సక్సెస్ అయ్యారు. అదే వరుసలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మిగతా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, వారి ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో వేచి చూడాలి. రెండు సంవత్సరాల క్రితం జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సంఘం నేతలు ప్రయత్నం చేసినా ఫలించలేదు. తొమ్మిది మంది పోటీపడగా సంఘం ఎన్నికల కమిటీ తీర్మానం చేసి అధ్యక్ష, కార్యదర్శుల పేర్లు ఖరారు చేసింది. దీన్ని కొందరు వ్యతిరేకించి పోటీ కావాలనడంతో ఎన్నిక తప్పలేదు. అధ్యక్షుడిగా జె.రామ్మోహన్ విజయం సాధించారు. కార్యదర్శిగా ధర్మారపు వెంకటయ్య ఏకగ్రీవమయ్యారు.

ప్రాధాన్యం కానున్న సామాజిక సమీకరణలు

రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సామాజిక వర్గ సమీకరణలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఉన్న కమిటీనే కొనసాగిస్తారా, లేక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారా అన్న విషయం ఇప్పుడు యూనియన్ సభ్యుల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా ఎన్నికలకు సమయం మరో ఐదు రోజులే ఉండడంతో ఆశావహులు ప్రచారంలో వేగం పెంచారు.

పోటీపడుతున్నది వీరే..

ఈసారి అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు పోటీ తీవ్రంగానే ఉంది. భువనగిరి మండలానికి చెందిన వీరారెడ్డి, రామన్నపేటకు చెందిన నిరంజన్‌రెడ్డి, తుర్కపల్లికి చెందిన ఉపేందర్‌రావు, రాజాపేటకు చెందిన అమరేందర్‌రెడ్డి, ఆలేరుకు చెందిన మధుసూదన్ పోటీ పడుతున్నారు.

యువజనోత్సాహం



యువజనోత్సవాలను పురస్కరించుకుని యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి ఖిలా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతుల నృత్య ప్రదర్శన

పాఠశాలల నిర్వహణకు నిధులు

- రూ.కోటి 69 లక్షలు మంజూరు
- తొలి విడతలో 50 శాతం విడుదల
- మౌలిక వసతుల కల్పనకు వెసులుబాటు



కేటాయించినవి ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.)
1-30	10,000
31-100	25,000
101-250	50,000
251-1000	75,000
1,000 పైగా..	1,00,000

భువనగిరి : నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రభుత్వ పాఠశాలలకు ఊరట కలిగింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. బడుల నిర్వహణ భారమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేయడంతో ప్రధానోపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు వెసులుబాటు కలగనుంది.

పాఠశాలలు, మంజూరైన నిధులు

జిల్లాలో 663 పాఠశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణకు రూ.1,69,45000 మంజూరు చేసింది.అందులో మొదటి విడుతగా రూ.84,72,500 విడుదల చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు నిధులు కేటాయించనున్నారు.

మూడు నెలల తరువాత..

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. మూడు నెలలు గడస్తున్నా పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు చేతినుంచి ఖర్చు చేశారు. మంజూరైన నిధుల్లో సగం విడుదల కావడంతో కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు చేతినుంచి ఖర్చు చేసిన డబ్బులను అమ్మ ఆదర్శ కమిటీల తీర్మానంతో తిరిగి తీసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎట్టకేలకు నిధులు విడుదల కావడంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు మార్గం సుగమం కానుంది.

వీటికి ఖర్చు చేయనున్నారు

వచ్చిన నిధులను పాఠశాలల్లో కనీస అవసరాలకు వినియోగించనున్నారు. చాక్ పీసులు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, తాగు నీరు, మరమ్మతులు, ఇంటర్‌నెట్, ప్రయోగశాలల పరికరాలు, రసాయన సామగ్రి, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు, బకెట్లు, చీపుర్లు, బిందెలు, సబ్బులు తదితర వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఏటా నిధులు కేటాయిస్తుంది. ఇదిలా ఉండగా గతంలో పాఠశాలల నిర్వహణ నిధుల నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుండడటంతో భారం తగ్గింది.

హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో పోచంపల్లి చేనేత స్టాల్



చేనేత వస్త్రాలు విక్రయిస్తున్న స్టాల్ నిర్వాహకురాలు స్వప్న, వెలుగు సీసీ వెంకటయ్య

సంస్థాన్ నారాయణపురం : సరస్ ఫెయిర్ ఆధ్వర్యంలో హైదారాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కార్మికులు ఏర్పాటు చేసిన స్టాల్ ఆకర్షిస్తోంది. ఖుషిశ్రీ టై అండ్ డై హ్యాండ్లూమ్ ఇక్కత్ ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేశారు. చేనేత పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసినట్లు వెలుగు సీసీ గడ్డం వెంకటయ్య, స్టాల్ నిర్వాహకురాలు గజం స్వప్న తెలిపారు. వినియోగదారులు చేనేత ఇక్కత్ వస్త్రాలను కొనుగోలు చేయడానికి మక్కువ చూపుతున్నట్లు పేర్కొన్నారు. గతంలోనూ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఎగ్జిబిషన్లలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు చేనేత రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కోరారు. చేనేత ఎగ్జిబిషన్‌లో సంస్థాన్ నారాయణపురం మండలం పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గజం శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా సాంకేతిక రంగానిదే

భూదాన్‌పోచంపల్లి : భవిష్యత్ అంతా సాంకేతిక రంగానిదేనని, విద్యార్థులు అందిపుచ్చుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారని విజ్ఞాన్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ లా డీన్ డాక్టర్ కల్పనా కోనేరు పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలో గల విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీలో బీబీఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ కోర్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు విశ్లేషణాత్మక నైపుణ్యాలను అవలర్చుకోవాలన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి డాక్టర్ సరితా సత్పతి మాట్లాడుతూ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, సవాళ్లను స్వీకరించేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ 2020 జాతీయ విద్యావిధానం అనుసరించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే విజ్ఞాన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కల్పనా కోనేరు

మొదటి యూనివర్సిటీ అని తెలిపారు. జాతీయస్థాయిలో 72వ ర్యాంకులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ అనిల్‌కుమార్, డిపార్టుమెంట్ కోఆర్డినేటర్లు డాక్టర్ సునిల్ సంకల, డాక్టర్ శివకుమార్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ కోర్డినేటర్ ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ అమీనా, డాక్టర్ సయ్యద్ మహబూబ్, డాక్టర్ లాల్రోఖ్వామా, డాక్టర్ సురేశ్‌చంద్ర,డా.జాన్‌బాబ్, డాక్టర్ అభినవ్, డాక్టర్ హిమామ్‌సాబ్, డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ఆలేరురూరల్ : ధరణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ ఆదేశించారు. శుక్రవారం ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో పెండింగ్ ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. గడువు నిర్దేశించుకుని ఆలోపు దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. అనంతరం మీసేవ కేంద్రాన్నితనిఖీ చేశారు. ధరల చార్ట్‌ను పరిశీలించారు. అధిక రుసుం వసూలు



మీసేవ కేంద్రం నిర్వాహకుడితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

చేస్తే మీసేవ సెంటర్‌ను రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.